ఉపాధి హామీ పథకానికి కేంద్రం తూట్లు

వామపక్ష పార్టీల నిరసన
గాంధీ పేరు తొలగింపు సరికాదు

విశాలాంధ్ర - విశాఖ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.మణి తదితరులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు నిర్వహించిన నిరసనలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వాటా కుదింపుతో ఈ చట్టం నిర్వీర్యమవుతోందన్నారు. రాష్ట్రం నెత్తిన ఏటా రూ,4 వేల కోట్ల భారం పడుతుందన్నారు. కష్ట జీవులు, వ్యవసాయ కూలీలకు నష్టం జరుగుతుందన్నారు. వలసలు భారీగా పెరిగే ప్రమాదముందన్నారు. కేంద్రంపై టీడీపీ, జనసేన పార్టీలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కేంద్ర కూటమిలో ఉన్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వం దీనిపై మౌనం దాల్చడం సరికాదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడంపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశాయని తెలిపారు. గాంధీపేరు తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను, ఆయన ఆశయాలను కేంద్ర ప్రభుత్వం అవమానించిందన్న విమర్శలు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ద్వారా ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ కూలీలు, కష్టజీవులు, గ్రామీణ కార్మికులు, చేతివృత్తిదారులు ఉపాధి పొందుతున్నారని, ఇది వారికి చట్టబద్ధమైన హక్కుగా మారిందన్నారు. కేంద్రం అలాంటి చట్టానికి పేరు మార్చడంతోపాటు నిధుల కోతల ద్వారా నిర్వీర్యం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలపై కష్ట జీవులు, వ్యవసాయ కూలీల్లో ఆందోళన నెలకొంద న్నారు. గతంలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ పేదలను రోడ్డున పడేలా చేశారని అన్నారు. మహాత్మాగాంధీ పేరుతోనే ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సీపీఎం జిల్లా నాయకులు ఎం.కృష్ణారావు, సీపీఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకుడు కె.దేవా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.పైడిరాజు, ఎం.మన్మధరావు, ఎన్.నాగభూషణం, కె.వనజాక్షి, సీఎన్ క్షేత్రపాల్, జి.రాంబాబు, పి.సూర్యకుమారి, జి.జయ, ఎం.శ్రీనివాసరావు, ఎ.దేవుడమ్మ, ఎ.ఆదినారాయణ, ఎన్.అప్పన్న, వి.నల్లయ్య, సీహెచ్ కాసుబాబు, వామపక్ష కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ అజేయశక్తి: స్టాలిన్

విశాలాంధ్ర - గాజువాక: 1925 డిసెంబర్ 26న ఆవిష్కరించిన సీపీఐ వందేళ్ళు పూర్తి చేసుకుని శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా సోమవారం చినగంట్యాడ కూడలిలో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు టి.సాంబమూర్తి ఆవిష్కరించారు. ముఖ్య అతిధిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఏజే స్టాలిన్ మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు ప్రజల పక్షాన రాజీలేని పోరాటాలు సాగిస్తోందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ పార్టీ అజేత శక్తిగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, కె.పోతయ్య, ఎ.శ్రీలక్ష్మి, పిల్లా పద్మ పాల్గొన్నారు.

ప్రజల పక్షాన వందేళ్లు: కసిరెడ్డి

విశాలాంధ్ర - గాజువాక: గంగవరం కూడలిలో సోమవారం సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సీపీఐ పతాకాన్ని జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ పార్టీ ఏర్పాటై వందేళ్లు అవుతుందని, ఈ వందేళ్లలో సీపీఐ ప్రజల పక్షాన నిరంతరంపోరు సాగించిందన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతూ ప్రజలతో మమేకమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పల్లేటి పోలయ్య, కె.పోతయ్య, వై.నందన్న, సోమేష్, మాధవరావు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డు పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడి తరగతుల బాలుర సంక్షేమ పాఠశాల, కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. డీఈఓ మ్యాథ్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో డీఈఓ స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవంతిలో ప్రపంచ ధ్యాన్య దినోత్సవం

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించార. యోగా, ధ్యానము వాటి యొక్క గొప్పతనం గూర్చి యోగా టీచర్ గాయత్రి వివరించారు. నమ్మకంతో ధ్యానం చేస్తే ఎలాంటి రోగాలైనా తగ్గుతాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించడానికి ఏకాగ్రత పెంచుకోవడానికి పాఠశాల స్థాయి నుంచే ధ్యానం అలవాటు చేసుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర - భీమిలి: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పేద మహిళలకు ఉపాధి నిమిత్తం 10 కుట్టు మిషన్లు, విజయనగరం మహిళా అంధ విద్యార్థినీలకు చదువు నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థికసాయం, దుస్తులు, మారికవలస 25 అంధ కుటుంబాలకు నెలకు సరిపడా కిరాణా సరుకులు, భీమిలి హైస్కూల్‌కు 15 వేల రూపాయల ప్రింటర్ వితరణగా అందజేశారు. అలాగే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ కమాండెంట్ కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, కలిగొట్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీ హిల్స్‌లో త్వరితగతిన మౌలిక సౌకర్యాలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ ఐటీ హిల్స్ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, డ్రైయిన్లు, లైట్లు, బ్యూటిఫికేషన్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఐటీ హిల్స్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల గురించి ఆయన ఏపీఐఐసీ ఇంజనీర్లతో ఎంవీపీ కాలనీలోని నివాసంలో సోమవారం సమీక్షించారు. కాగ్నిజెంట్, ఫ్లూయంట్ గ్రిడ్, ఇమాజినేటివ్, సత్వా తదితర ప్రముఖ ఐటీ సంస్థలకు ప్రభుత్వం శంకుస్థాపన చేసిన నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన వేగంగా జరగాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి కావాలన్నారు. విశాఖ ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడానికి మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

విశాలాంధ్ర - పద్మనాభం: నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి పద్మనాభం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. మరుగుదొడ్లు మరింత శుభ్రంగా ఉంచాలని, స్టేషన్ ఆవరణలో ఎక్కువగా మొక్కలు నాటించాలని సూచించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ క్రైం స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పారదర్శక సేవలందించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు 58, 59, 60 వార్డు సచివాలయం సిబ్బందితో ఆత్మీయ సమావేశం 61వ వార్డు మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద నిర్వహించారు. సచివాలయ సిబ్బంది పారదర్శకంగా సేవలందించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, ఎమ్మార్వో రమేష్, సూరి సురేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సివిల్ సప్లయి ఏఎస్ఓ, బీజేపీ పలమరశెట్టి శ్రీను, 58వ వార్డు కోరాడ శ్రీనివాస్, శ్రీరామ్ ఉమామహేశ్వరి, పోతావత్తుల శ్రీను, 60వ వార్డు మాతా శ్రీను, 59వ వార్డు అధ్యక్షులు హరి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు నక్క లక్ష్మణరావు, ఏడు వార్డుల సమన్వయకర్త ఎస్సీసెల్ అధ్యక్షులు నీలాపు జోజ, మిత్తిరెడ్డి శంకర్ పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ థియేటర్ వద్ద వైసీపీ ఆందోళన

- పార్టీ కార్యక్రమానికి అనుమతి ఇచ్చి రద్దుచేశారని ఆరోపణ
- నిబంధనలను ఉల్లంఘించారన్న వీఎంఆర్‌డీఏ అధికారులు

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో పార్టీ కార్యక్రమానికి అనుమతి ఇచ్చి తరువాత రద్దుచేయడం అన్యాయమని వైసీపి నాయకులు సిరిపురంలోని చిల్డ్రన్స్ థియేటర్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. వైసీపీ సోషల్ మీడియాకి చెందిన ధర్మాన ఆనంద్ తనతోసహా 1600 మంది పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌ని అద్దెకు తీసుకున్నారు. దీని కోసం వీఎంఆర్‌డీఏకి రూ.71,300 చెల్లించారు. ఆదివారం రాత్రి ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం కార్యక్రమం నిర్వహణ కోసం వచ్చేసరికి వీఎంఆర్‌డీఏ అధికారులు అనుమతులు రద్దుచేశామని చెప్పి, గేట్లు మూసివేశారు. దీనిపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఎంఎల్‌సీ వరుదు కల్యాణి తదితరులు చిల్డ్రన్స్ థియేటర్ వద్ద ఆందోళన నిర్వహించారు. కూటమి నాయకుల ఒత్తిడి వల్లే వీఎంఆర్‌డీఏ అధికారులు అనుమతులు రద్దుచేశారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులకు కార్యక్రమం వివరాలు స్పష్టంగా చెప్పి అనుమతులు తీసుకున్నామని వైసీపీ సోషల్ మీడియాకి చెందిన ధర్మాన ఆనంద్ తెలిపారు. 1600 మందికి భోజనాలు కూడా ఏర్పాటుచేశామని తెలిపారు. చిల్డ్రన్స్ థియేటర్ వద్ద వైసీపీ నాయకుల ఆందోళనతో పోలీసులు చేరుకుని ఆందోళన చేస్తున్నవారిని పంపేశారు. వారంతా కృష్ణా కళాశాల రోడ్డులోని పార్టీ కార్యాలయానికి వెళ్ళిపోయారు. దీనిపై వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందిస్తూ నిర్వాహకులు గెట్ టు గెదర్ పేరుతో ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నారని వెల్లడించారు. అయితే దానికి విరుద్ధంగా చిల్డ్రన్స్ థియేటర్ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారని తెలిపారు. నిబంధనల ప్రకారం రాజకీయసంబంధ బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించడం నిషేదమని వీఎంఆర్‌డీఏ ఎంసీ ఎన్.తేజ్ భరత్ ఒక ప్రకటనతో తెలిపారు. సెంట్రల్ ఏసీ పనిచేయకపోవడం కారణంగా మరో రెండు రోజులు అన్ని కేటాయింపులు రద్దుచేస్తున్నామని చెప్పారు. కేటాయింపులు చేసుకున్నవారికి డబ్బులు రిఫండ్ చేశామని తెలిపారు.

గోమాంసాన్ని నిర్వీర్యం చేసిన పోలీసులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురంలో భారీ గో మాంసం రాకెట్ బట్టబయలు అయింది. 189 టన్నుల అక్రమ మాంసం సీజ్, ధ్వంసానికి కోర్టు అనుమతి లభించడంతో గోవులను అక్రమంగా చంపి వాటి మాంసాన్ని విదేశాలకు తరలిస్తున్న అంతర్జాతీయ రాకెట్‌ను విశాఖ సిటీ పోలీసులు బట్టబయలు చేశారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీ మిత్ర కోల్డ్ స్టోరేజ్‌లో తనిఖీలు నిర్వహించి 1,89,737 కిలోల అక్రమ గోవు మాంసాన్ని సీజ్ చేశారు. పశు సంవర్ధక శాఖకు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించగా గేదె మాం-సం పేరుతో ఎగుమతికి సిద్ధం చేసిన మాంసంలో పెద్దమొత్తంలో ఆవు మాంసం ఉన్నట్లు హైదరాబాద్ ల్యాబ్ నివేదికలో తేలింది. ఇందులో 87,945 కిలోల మాంసం ఆవు మాంసమని నిర్ధారణ అయినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మణికంఠ, ఏసీపీ అప్పలరాజు, సీఐ సీహెచ్ వాసునాయుడు ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై క్రైం నెం. 262/2025 కింద కేసు నమోదు చేసి మిస్ ఓవరేజ్ ప్రైవేట్ కంపెనీ యజమాని ఎండి పర్వాన్‌ను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితులైన మన్సూర్ అలీను లోనావాలాలో, రషీద్ ఖురేషిను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో పోలీసులు పట్టుకున్నారు. నిందితులు నకిలీ ఇన్వాయిస్‌లు, ఈవే బిల్లులు, హెల్త్ సర్టిఫికెట్లుతో గోమాంసాన్ని గేదె మాంసంగా చూపి విశాఖ పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది. సీజ్ చేసిన మాంసాన్ని ధ్వంసం చేయాలనిపోలీసుల అభ్యర్థన మేరకు కోర్టు అనుమతి ఇవ్వడంతో జీవీఎంసీ కాలుష్య నియంత్రణ మండలి, పశు సంరక్షణ శాఖ, రెవెన్యూ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో 189 టన్నుల అక్రమ మాంసాన్ని భూమిలో పాతిపెట్టారు.

ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

విశాలాంధ్ర - ఆనందపురం: మ్యాథ్స్ పితామహుడు శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలను వేములవలస ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులు గణితంలో వివిధ రకాలైన మోడల్స్ తయారు చేసి గణిత సమస్య సాధనలపై వివిధ రకాలైన సాధన కృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మ్యాథ్స్ టీచర్ పద్మావతి, హెచ్‌ఎం శ్రీశైలజా, అప్పలనాయుడు, కేశవరావు పాల్గొన్నారు.

పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావుకు డీజీపీ మెడల్

విశాలాంధ్ర - కొమ్మాది: విశాఖ నగర పోలీస్ విభాగంలో విశిష్ట సేవలు అందిస్తున్న పీఎం పాలెం ఎస్ఐ కె.భాస్కరరావు అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రకటించిన డీజీపీ కమెండేషన్ డిస్క్ బ్రాంజ్ పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుండి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాలంలో కె.భాస్కరరావు కనబరిచిన అంకిత భావం, క్రమశిక్షణను ప్రభుత్వం గుర్తించింది. పీఎం పాలెం స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌ను సమర్థవంతంగా నిర్వహించడం నేరాల అదుపులోనూ క్లిష్టమైన కేసుల దర్యాప్తులో చురుకైన పాత్ర పోషించడం, ప్రజలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వారి భద్రతకు భరోసా కల్పించడం వంటి అంశాల్లో ఆయన చేసిన కృషిని ఉన్నతాధికారులు కొనియాడారు. ప్రతిష్టాత్మకమైన డీజీపీ మెడల్‌కు ఎంపికైన సందర్భంగా నగర పోలీస్ ఉన్నతాధికారులు కె.భాస్కరరావును ప్రత్యేకంగా అభినందించారు.

వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర - కొమ్మాది: వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా సూరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా టి.సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం తెలిపింది. తమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. సంఘం నాయకులు చలుమూరి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘం సభ్యులు, తదితరలు పాల్గొన్నారు.

విశాఖ జూలో సింహం పిల్ల మృతి

విశాలాంధ్ర - పీఎం పాలెం: నగరంలోని ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో విషాదం చోటు చేసుకుంది. 83 రోజుల వయస్సున్న ఆ ఆడ సింహం పిల్ల సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. గత ఐదు రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఈ పిల్ల పశు వైద్యుల పర్యవేక్షణలో ఉంది. అయినప్పటికీ పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయిందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఇంటస్సుసెప్షన్ వైద్యుల పోస్టుమార్టం నివేదిక ప్రకారం ఇంటస్సుస్సెప్షెన్ వల్ల రక్తప్రసరణ ఆగిపోయి మృతి చెందిందని అధికారులు వెల్లడించారు. జూలో జంతువుల సంరక్షణకు తాము అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నామని క్యూరేటర్ తెలిపారు.

జనసేనాని సమీక్షకు ఏఎంసీ డైరెక్టర్ నాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి: జనసేన పార్టీ నుండి ఎంపికైన ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ ద్వారా పదవులు పొందిన నాయకులతో ఆ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జనసేన సీనియర్ నాయకుడు ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు. సోమవారం పెందుర్తి నుండి పలువురు నాయకులతో కలిసి అమరావతి వెళ్లిన నాయుడు పవన్ కల్యాణ్ నిర్వహించిన సమావేశంలో పాల్గొని పెందుర్తి ఏఎంసీ కార్యకలాపాలపై నివేదిక అందజేశారు. జనసేన చేపడుతున్న రాజకీయ కార్యకలాపాలను వివరించారు. ఆర్ఎస్ నాయుడు మాట్లాడుతూ పవన్ నిర్వహించిన సమీక్ష కార్యక్రమం వ్యవస్థలను మరింత బలోపేతం చేసేదిగా ఉందని పేర్కొన్నారు. కేవలం పార్టీపరంగానే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల ప్రక్షాళనకు దోహదపడేలా ఉందన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్వామి వివేకానంద విద్యార్థుల సత్తా

విశాలాంధ్ర - ఆనందపురం: సామర్లకోటలో నిర్వహించిన 4వ ఇన్విటేషనల్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆనందపురం నీళ్లకుండీలు వద్ద గల శ్రీ సాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో ఎన్.ప్రేమ్‌కుమార్, కె.కార్తికేయ, జి.సతీష్, పి.హేమ సూర్యలు మొత్తం 2 గోల్డ్, 4 సిల్వర్ మెడల్స్ గెలుచుకున్నారు. అలాగే జూనియర్స్ విభాగంలో డి.మోక్షిత, సీహెచ్ విద్య, కె.భార్గవసాయి, పియూష్ కుమార్ సింగ్‌లు 3 గోల్డ్, 5 సిల్వర్ మెడల్స్ సాధించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ స్టైల్ చీఫ్ కట్టమూరి బాలభాను తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు, ప్రదానోపాధ్యాయురాలు అభినందించారు.

సర్వే సర్టిఫికెట్లు ఇకపై ఆన్‌లైన్‌లో జారీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలకు ఇకపై సర్వే సర్టిఫికెట్లు జీవీఎంసీ వెబ్సైట్ ద్వారా ఆన్ లైన్‌లోనే పొందవచ్చునని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్వే సర్టిఫికెట్ అప్లికేషన్‌ను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. నగర మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలకు సర్వే సర్టిఫికేట్ పొందవలసి ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ కమిషనర్ వినూత్న ఆలోచనతో సర్వే సర్టిఫికెట్లను జీవీఎంసీ వెబ్సైట్ ద్వారా ఇకపై సులభంగా ఆన్లైన్‌లోనే జారీ చేసేందుకు శ్రీకరం చుట్టారని తెలిపారు. అందుకు సంబంధించిన అప్లికేషను నేడు లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. సర్వే సర్టిఫికెట్లు మాన్యువల్ పద్ధతిలో జరుగుతున్నందున ప్రజలు ఎక్కువ సమయం వెచ్చించడం తోపాటు కార్యాలయాలు చుట్టూ తిరగడం జరుగుతుందని, ఈ సర్వే సర్టిఫికెట్లు ఆన్లైన్లో దరఖాస్తు చేయడం వలన వారం రోజుల్లోనే సర్వే సర్టిఫికెట్‌ను పొందువచ్చునన్నారు. అలాగే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో నేరుగా తెలుసుకోవచ్చునన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు సౌకర్యార్థం జీవీఎంసీ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలకు సర్వే సర్టిఫికెట్లు పొందేందుకు మాన్యువల్ పద్ధతి కాకుండా ఇకపై జీవీఎంసీ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ పద్ధతిలో పొందేందుకు నేడు సర్వే సర్టిఫికేట్ అప్లికేషన్ లాంఛనంగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. సర్వే సర్టిఫికెట్ల కొరకు ప్రజలు జీవీఎంసీ ప్రధాన కార్యాలయం జోనల్ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇకపై వారం రోజులలో సులభంగా ఆన్లైన్లోనే సర్వే సర్టిఫికేట్ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డివి రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ,, చీఫ్ సిటీ ప్రభాకర్‌రావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్వి నరేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాసరావు, వ్యయపరిశీలకులు సి.వాసుదేవ రెడ్డి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

అటానమస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల (అటానమస్)లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డీవీపీ నందూరి సాంబశివరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచే సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదన్నారు. అకడమిక్ టాపర్స్‌కు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్ నర్రా సురేష్, కోకలిజావిటోస్టెక్ సొల్యూషన్స్ ఫౌండర్ చైర్మన్ కెవి సత్యనారాయణ, వైస్ చైర్మన్ వి.సుబ్బరాజు, డైరెక్టర్లు బి.భాస్కర్‌రావు, పి.వెంకటేశ్వరరావు, పి.ప్రకాష్, ప్రిన్సిపాల్ డా. జీవి ప్రదీప్ వర్మ పాల్గొన్నారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముతూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణీ క్రిసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	ఎల్ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ఎకౌంట్‌నెం.MHFLPROVIS000005010711 1. బల్లంగి సింహాచలం, 2. బి గంగతల్లి	12-ఆగస్టు 2025	08-ఆగస్టు-2025 నాటికి రూ.4,74,701.99/-	22-డిసెంబరు -2025

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: విశాఖపట్నం జిల్లా, రోదవరం మండలం, రోదవరం ఎస్ఆర్ఓ, సీమునపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ, సర్వేనం.91-4, అసెస్‌మెంట్ నం.20, డి.నం.1-33 వద్ద 475 చదరపు అడుగుల నిర్మిత ప్రదేశముతో ఆర్‌సిసి పైకప్పు నివాసిత భవనం తోపాటు 74.41 చదరపు గజాల విస్తీర్ణపు భూమి యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: జిల్లేడిపూడి దేముడమ్మ ఆర్‌సిసి ఇల్లు, ఉత్తరం: రాస్తా, దక్షిణం: బొర్రా నూకాలు స్థలం

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 23 డిసెంబరు, 2025 సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి కోవెలలో వికసించిన కమలం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ వాస్తవ్యులైన 75 వ వార్డ్ కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మనుమరాలు , పులి సురేష్ రెడ్డి (బాబీ) కుమార్తె బేబీ విధాత్రి రెడ్డి పులి భరతనాట్య ప్రదర్శన తెలంగాణా రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో ప్రదర్శన ఇచ్చారు ఇచ్చారు. అతి చిన్న వయసులో మహా క్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామి కోవెలలో ప్రదర్శన ఇవ్వడం చాలా గర్వంగా ఉందని, పిల్లలయొక్క ఆలోచనలను గౌరవిస్తూ వారి యొక్క అభీష్టమ మేరకు వారి యొక్క ఆలోచనలకు అనుగుణంగా తల్లిదండ్రులు నడుచుకోవాలని పులి సురేష్ రెడ్డి అన్నారు. పులి లక్ష్మిబాయి వెంకట రమణా రెడ్డి మనుమరాలు యొక్క ప్రదర్శనను చూసి ఎంతో ఆనందించారు.

గ్రామ సమస్యలపై ఎంపీ శ్రీభరత్ దృష్టి

విశాలాంధ్ర - తగరపువలస: గ్రామ సమస్యలపై విశాఖపట్నం టీడీపీ ఎంపీ భరత్ దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం భీమిలి మండలం లోని తాళ్లవలస పంచాయితీ లో గ్రామ ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రజా సమస్యలపై సమావేశం అయ్యారు. ఈ

సమావేశంలో గ్రామాల్లోనూ అభివృద్ధి పనుల గురించి ప్రజలకు అందే అభివృద్ధి ఫలాలు గురించి తెలుసుకొని ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఉద్దేశంతో ఈ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ భరత్ ను అమనాం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు భీమిలి నియోజకవర్గ లీగల్ సెల్ ప్రెసిడెంట్ మరగద రఘురామిరెడ్డి, అమనం గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ చుక్క ఆదిరెడ్డి, ఏపీసీ డైరెక్టర్ చుక్క ఉమాదేవి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లు నరసింహ, మరగద గౌరీ మరియు జనసేన గ్రామ పార్టీ నాయకులు అడపా వేణుగోపాల్, సగరదరెడ్డి తదితరులు పాల్గొని తమ గ్రామ సమస్యలను ఎంపి భరత్ కు వివరించారు.

జీవీఎంసీకి జాతీయ అవార్డులపై అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ లో జీవీఎంసీ కి మూడు ప్రతిష్టాత్మక పీ.ఆర్.ఎస్.ఐ-2025 జాతీయ అవార్డులు దక్కడం పై నగర మేయర్ పీల శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆయా సంబంధిత అధికారులను అభినందించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరం లో పీ.ఆర్.ఎస్.ఐ జాతీయ అవార్డులు జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ , పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎన్. నాగేశ్వరరావు నగర మేయర్ కు, జీవీఎంసీ కమిషనర్ కు చూపించి అందించారు. నగర మేయర్ మాట్లాడుతూ 47వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ లో జీవీఎంసీ కి పీ.ఆర్.ఎస్.ఐ-2025 లో 3 ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు దక్కడంపై సంబంధిత అధికారులను అభినందించడం జరిగిందని తెలిపారు. "బెస్ట్ సి ఎస్ ఆర్ ప్రాజెక్ట్ ఫర్ చైల్డ్ కేర్ " లోను, "బెస్ట్ యూజ్ ఆఫ్ సోషల్ మీడియా ఇన్ ఎ కార్పొరేట్ క్యాంపెయిన్" లోను ప్రథమ స్థానాలు కైవసం చేసుకొనగా, "ఉమెన్స్ ఎంపవర్మెంట్ అండ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ " కేటగిరిలో ద్వితీయ స్థానం జీవీఎంసీ సాధించిందని మేయర్ తెలిపారు. రానున్న రోజుల్లో ఇటువంటి మరిన్ని ప్రతిష్టాత్మకమైన అవార్డులను జీవీఎంసీ లో ఉన్న ప్రతి విభాగం లో కూడా వారి కార్యాచరణ దిశగా అవార్డులను సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు అని వ్యక్తం చేశారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ లో ఈ నెల 13 నుండి 15 వరకు నిర్వహించిన 47వ అఖిలభారత పబ్లిక్ రిలేషన్ కాన్ఫరెన్స్ 2025లో జీవీఎంసీ మూడు ప్రతిష్టాత్మక పి.ఆర్.ఎస్.ఐ - 2025 జాతీయ

అవార్డులను సాధించడం జీవీఎంసీ కి ఎంతో గర్వ కారణమని కమిషనర్ తెలిపారు. ఈ అవార్డులు విశాఖ నగర ప్రజలు ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులు, అందించిన నిరంతర సహకారము, భాగస్వామ్య ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని కమిషనర్ తెలిపారు. ఇటువంటి అవార్డులు అధికారులు సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించి మరెన్నో అవార్డులు దక్కేలా జీవీఎంసీ లో గల అన్ని విభాగాలలో అధికారులు ,ఉద్యోగులు విశాఖ నగర అభివృద్ధి దిశగా ప్రతిభను కనబరిచి అవార్డుల సాధనకు క ృషి చేయాలని కమిషనర్ అధికారులకు ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవిఎంసి ఉన్నతాధికారులు, ఇంజనీర్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్.ఎస్.ఆర్.ఐ.టి కళాశాల క్రీడాకారులు

విశాలాంధ్ర - ఆనందపురం: 2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి సౌత్ జోన్ టేబుల్ టెన్నిస్ (పురుషులు) ఛాంపియన్‌షిప్ పోటీలు డిసెంబర్ 25 నుండి 28 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎంఐఎస్‌టీ యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు జేఎన్‌టీయూ జీవి విశ్వవిద్యాలయం తరఫున ఎన్.ఎస్.ఆర్.ఐ.టి కళాశాల నుంచి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 23 ఉదయం చెన్నైకి

బయలుదేరనున్నారు. కళాశాల యాజమాన్యం క్రీడాకారులకు నిరంతర ప్రోత్సాహం అందిస్తూ ఆర్థిక సహాయం, రవాణా సౌకర్యాలు తదితర అన్ని అవసరాలను సంపూర్ణంగా కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.శంభు ప్రసాద్, సి.ఏ.ఓ. డా. సుబ్బరాజు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తూ విద్యార్థులు ఉన్నత స్థాయిలకు ఎదిగేలా దిశగా కళాశాల యాజమాన్యం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో జేఎన్‌టీయూ జీవి విశ్వవిద్యాలయం తరఫున వెళ్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయం, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఆకాంక్షించారు.

బేతనిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర పీఎం పాలెం : ఏసుక్రీస్తు పుట్టిన రోజుని ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు ఎంతో పవిత్రంగా భావిస్తూ క్రిస్మస్ పండుగ జరుపుకుంటారని. జీసస్ జన్మించి నేటికి రెండు వేల సంవత్సరాలు దాటినా కరుణామయుడుగాను, దయామయుడుగాను కీర్తిస్తున్నారని, లోక రక్షకుడు క్రీస్తు రక్షణ్ని చిందించారని బేతని సంస్థల చైర్మన్, ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.ఏసుపాదం పేర్కొన్నారు. మహా

విశాఖ,జోన్ 2 పరిధి 6 వ వార్డు పీఎం పాలెం బేతని ప్రాంగణంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బేతని పాఠశాల విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమములు అలరించాయి. అనంతరం ఏసుపాదం మాట్లాడుతూ యేసు కృపతో దేశ విదేశాల్లో ఎంతో మంది పేదవారికి సేవ చేసే భాగ్యం కలిగిందని అన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో విపత్కర సమయాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందించామని గుర్తు చేశారు. క్రిస్మస్ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేసారు అనంతరం కుటుంబ సభ్యులు తో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ అడ్మినిస్ట్రేటర్ సునీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ ఫేషియల్ కీలక పాత్ర

విశాలాంధ్ర - విశాఖపట్నం: నేత్ర వైద్య చికిత్సల్లో ఆక్యులోప్లాస్టీ అనేది ప్రత్యేకమైన విధానమని, నేత్ర సంరక్షణలో ఆక్యులోప్లాస్టీ ఫేషియల్ కీలక పాత్ర పోషిస్తుందని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్ వీపీఈఐ) వైద్యులు, విశాఖపట్నం క్యాంపస్ వైద్యులు మరియు కన్సల్టెంట్స్ ఆక్యులోప్లాస్టి సర్జరీ డాక్టర్ సునీత గవర, డాక్టర్ లావణ్య మద్ది తెలిపారు. ఈ మేరకు

ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల జీఎంఆర్ వరలక్ష్మి ప్రాంగణంలో సోమవారం ఆక్యులోప్లాస్టీ %e% ఫేషియల్ చికిత్స పై జరిగిన వర్క్ షాప్ లో ఆమె మాట్లాడుతూ కంటి రెప్పల లో సంభవించే లోపాలు, కంటి నుంచి నీరు కారటం, కంటి పరిసరాలలోని లోపాలు, దృష్టి పని తీరు మరియు కంటి ఆరోగ్యాన్ని సరిచేయడంలో ఆక్యులోప్లాస్టీ చికిత్స కీలక పాత్రను పోషిస్తున్నదన్నారు. ఆక్యులోప్లాస్టి కంటి భాగాల నిర్మాణంలోను మరియు కంటి దృశ్యశాస్త్రంలోనూ సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండటం, ఆక్యులోప్లాస్టీ ఫేషియల్ రెండింటి చికిత్సల్లో అనుసంధానత కలిగి కంటి లోపాలను సవరిస్తుందన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది కనురెప్పలు వాలిపోతున్నాయని, కళ్ల వెంట నీరు కారుతున్నాదని, పెరియోక్యులర్ వృద్ధాప్య సమస్యలు మరియు కళ్ళ చుట్టూ వలయాలు ఏర్పడటం వంటి పలురకాల సమస్యలతో నేత్ర వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఇవి కేవలం కాస్మెటిక్ సమస్యలు మాత్రమే కాదని, వీటి వలన దృష్టి లోపం, రెప్పలు ఆద్యులలో ఇబ్బందులు మరియు నేత్ర బాహ్య సౌందర్యం నకు ఆటంకం కలుగవచ్చునన్నారు. కంటికి సంబంధించి ఎలాటి సమస్యను ఉపేక్షించ కూడదు అన్నారు. అది చిన్న లోపమైనా కంటి పైన పెద్ద ప్రభావం చూప వచ్చును. అందువలన కంటి దృష్టిని మరియు కంటి పరిసరాలను సంరక్షించుటకు అవసరమైన ప్రక్రియలను ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. కను రెప్పల లోపాలను, ప్టోసిస్, లాక్రిమల్ డిజార్డర్స్, కంటి గాయాలు, ట్యూమర్ వంటి వాటిని ఆక్యులోప్లాస్టి సర్జరీ ద్వారా నివారించ వచ్చును. అంతేకాకుండా వృద్ధాప్యం కారణంగా కంటి చుట్టూ ఏర్పడే వృద్ధాప్పపు చాయలను కూడ బోటోలినమ్ టాక్సిన్ ఇంజక్షన్లు మరియు డెర్మల్ ఫిల్లర్ సహాయంతో పరిష్కరించ వచ్చును.ఈ చికిత్సలు కంటి సహజత్వానికి ఆటంకం కలుగకుండా సంరక్షించుటకు సహాయపడతాయని చెప్పారు. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య శాల (ఎల్ వీ పీఈఐ) లో ఆక్యులోప్లాస్టీ చికిత్స అందుబాటులో ఉందని చెప్పారు.

95వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలపల్లి, శేషాద్రినగర్‌లో పెందుర్తి బీజేపీ నాయకులు, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. అక్కడ నూతనంగా వేసిన సీసీ రోడ్డు, ఇంకా వేయాల్సిన రోడ్లు, కాలువలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కొరకు మొక్కలు నాటారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి నూతన

హ్యాండ్ బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో మంచినీటికి ఇక్కట్లు పడుతున్నామని, స్థానికుల ఫిర్యాదు మేరకు హ్యాండ్ బోరును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ 95, 97 వ వార్డుల ఉపాధ్యక్షులు పీవీవీ ప్రసాద్, టీడీపీ 95వ వార్డు ఎస్సీ సెల్ అధ్యక్షులు సబ్బవరపు డాక్టర్ ప్రకాష్, బీజేపీ 95, 97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంటిపోయిన వెంకట సంతోష్, అయిత శివ, శేషాద్రినగర్ కాలనీ ప్రెసిడెంట్ రాజా, సెక్రటరీ గొలగాని శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ రజని, జాయింట్ సెక్రటరీ అశోక్, సభ్యులు శేషారావునాయుడు, జగ్గారావు, శేఖర్, ఈగల శివ, నూకరత్నం, సీహెచ్ లక్ష్మి, అప్పలకొండ, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ సేవాదళ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి పంచాయితీ పరిధిలో రౌతుల పాలెం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు డొక్కా సీతమ్మ పేరిట డొక్కా సీతమ్మ సేవాదళ్ అనే సంఘాన్ని ఏర్పాటు చేసి, ఈ డొక్కా సీతమ్మ సేవాదళ్ సంఘం ద్వారా ఎంతో మందికి చాలా విధాలుగా సహాయ సహకారాలను అందిస్తున్నారు.

కాశీపట్నం నుండి వైకుంఠపురం కు వెళ్లే మార్గంలో కొండ ప్రాంతంలో నివసించే సుమారు 70 మంది గిరిజనులకు దుప్పట్లు, గిరిజన పిల్లలకు చెప్పులు, బిస్కెట్ ప్యాకెట్లను ఇవ్వడం జరిగింది. డొక్కా సీతమ్మ సేవాదళ్ రౌతులపాలెం యువకులు చేసిన ఈ సహాయానికి గిరిజనులు ఎంతో ఆనందాన్ని కృతజ్ఞతను వ్యక్తం చేశారు.

పాత బస్టాండ్ ఖాళీస్థలంలో కల్యాణ మండపం నిర్మించండి

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ వార్డులో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అనకాపల్లి

నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు గ్రీవెన్స్ ద్వారా అధికారులను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా భీమిలి జోనల్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు ఇచ్చిన వినతిపత్రం ద్వారా గంటా నూకరాజు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా పాతబస్టాండ్ వద్ద అవంతి శ్రీనివాసరావు కార్యాలయానికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో కల్యాణ మండపం గానీ, షాపింగ్ కాంప్లెక్స్ గానీ నిర్మాణం చేయాలని కోరారు. దీనిద్వారా స్థానిక వ్యాపారస్తులు కొంతమంది బ్రతకడానికి అవకాశం ఉంటుందన్నారు. భీమిలిలో సరైన కల్యాణ మండపం లేనందున ఉన్నతమైన మౌలిక వసతులతో నిర్మించినట్లయితే స్థానికులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. సముద్ర తీరం వెంబడి రక్షణ గోడ నిర్మాణం చేయాలని కొన్నేళ్లుగా ప్రతిపాదన ఉందని కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ నిర్మాణం చేపట్టడం ద్వారా సముద్రం కోతను అరికట్టవచ్చన్నారు. అలాగే పలు సమస్యలపై ఆయన వినతిపత్రం అందజేశారు.

హక్కులపై అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: హక్కులను ఆయుధాలుగా మలచుకొని వినియోగదారులు మోసాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రూపొందించిన

మేలుకో హక్కులు తెలుసుకో అందరి చట్టం వినియోగదారుల రక్షణ చట్టం ప్రోచరను కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిన తరుణంలో సైబర్ మోసాలు, తప్పుడు ప్రకటనల పట్ల కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కరరావు, కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, కన్స్యూమర్ రైట్స్ సేఫ్ గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, జిల్లా రెవెన్యూ అధికారి కె.సత్తిబాబు, యూనిసెఫ్ సీడీ సత్యవేణి, ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ అవార్డు గ్రహీత రామప్రసాద్, లీలా ప్రసాద్, బంగారు శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

గీతంలో గణిత శాస్త్ర దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: భారతీయ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజం 138వ జయంతి సందర్భంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం తేది: 22-12-2025న నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ (హోరా) గణిత శాస్త్ర విభాగం డీన్ ప్రొఫెసర్ సుకుమార్ దాస్ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రామానుజం గణిత శాస్త్రంలో చేసిన అపార

కృషిని ప్రపంచ వ్యాప్తంగా గణితాన్ని సరికొత్త దశలో నిలిపిందని తెలిపారు. కంప్యూటర్ సహా అంతరిక్ష శాస్త్రం వరకు అన్ని రంగాలలోను గణిత శాస్త్రం ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎన్.అనంతరామకృష్ణ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, గణిత శాస్త్ర విభాగం అధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ వి.శిరీష, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎమ్.ఎమ్.సందీప్, డాక్టర్ పి.శ్రీహరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 436 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు గణిత శాస్త్రంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్య అతిథి చేతులు మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"కు 99 వినతులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 99 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరం లో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 99 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 13, 3వ జోన్ కు 21, 4వ జోన్ కు 12, 5వ జోన్ కు 06, 6వ జోన్ కు 10, 8వ జోన్ కు 11, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 26 ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్స్ విభాగమునకు 09, రెవెన్యూ విభాగమునకు 12, ప్రజారోగ్య విభాగమునకు 03, పట్టణ ప్రణాళిక విభాగమునకు 42, ఇంజినీరింగు విభాగమునకు 22, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 07 కలిపి మొత్తంగా 99 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ సత్యనారాయణ రాజు, అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఎ.ప్రభాకర రావు, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, డిడిహెచ్ ఎమ్.దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, స్టోర్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, సిపి, డిసిపి లు, ఏసిపి లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ కృపావరం, ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసినాయుడు,బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్), భీమునిపట్నంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.జి.ఎస్. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గణితదినోత్సవవేడుకలువైభవంగానిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జీవితం, ఆయన చేసిన గణిత పరిశోధనలు ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. గణితం కేవలం సంఖ్యల సమాహారం కాకుండా, మానవ జీవితంలో తర్కశక్తిని, సమస్యల పరిష్కార నైపుణ్యాన్ని పెంపొందించే

ముఖ్యమైన శాస్త్రమని వివరించారు. వేడుకలలో భాగంగా నిర్వహించిన గణిత ప్రదర్శన (మాథ్స్ ఎగ్జిబిషన్) లో శిక్షణార్థులు రూపొందించిన వినూత్నమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ (టి ఎల్ ఎం ఎస్), వర్కింగ్ మోడల్స్ , గణిత పాటలు, గణిత పజిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శనలు గణిత భావనలను సులభంగా, ఆసక్తికరంగా విద్యార్థులకు అందించడంలో ఉపకరిస్తాయని గణిత అధ్యాపకులు ఉదయశేఖర్, శ్రీధర్ , వసుంధర మేడమ్ మరియు అధ్యాపకులు అందరూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, శిక్షణార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు వేడుకలను విజయవంతం చేశారు.

అంధకారంలో నడిచిన పీజీఆర్ఎస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అంధకారంలో నడిచింది. ప్రారంభంలో కొంతసేపు పవర్ ఉన్నప్పటికీ తర్వాత చాలాసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వినతులు స్వీకరించడంలో ప్రజలు, వినతులు స్వీకరించిన అధికారులు ఇబ్బంది పడ్డారు. సెల్‌ఫోన్ లైటింగ్‌లోనే కార్యక్రమం నడిచింది. కలెక్టర్ ఆఫీసుఅంతా విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ కాన్ఫరెన్స్ హాలులోకి సెన్సార్ సమస్య వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు.

కేఎఫ్‌సీలో రూ.799 ఇయర్ ఎండ్ ప్రత్యేక విందు

విశాలాంధ్ర - విశాఖపట్నం: సంవత్సరాంత వేడుకలు మరింత అద్భుతంగా క్రిస్పీగా, ఫింగర్ లికింగ్‌తో స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంవత్సరాంత వేడుకల కోసం కెఎఫ్‌సీ ఎపిక్ విందును తీసుకువస్తోంది. చికెన్ ప్రియుల సిగ్నేచర్ హాట్, క్రిస్పీ చికెన్, జ్యూసీ బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్, ఫ్రైస్, చల్లబడిన పెప్సీ మరియు వివిధ రకాల రుచికరమైన డిప్‌లను ఆస్వాదించవచ్చు. కేవలం 799 రూపాయలతో ప్రారంభమయ్యే ఎపిక్ విందు ఆఫర్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, కర్నాటకతో సహా భారతదేశంలో ఎంపిక చేసిన మార్కెట్లలో డైన్ ఇన్, టేక్ అవే కోసం జనవరి 4 వరకు మాత్రమే అందుబాటులో ఉందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.